ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 7 మే 2024 | 5



కూటమిని గెలిపించండి : ప్రధాని మోదీ అభివాదం

మోదీ బాణం : విల్లు ఎక్కుపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ

మోదీ సభలో ప్రజలకు నమస్కరిస్తున్న పవన్

మోదీ సభలో లోకేశ్ అభివాదం

జనామోదీ..

రాజమహేంద్రవరాన ఉప్పొంగిన ప్రజాగళం

- గోదారులన్నీ జన ప్రవాహమే
- జనంతో నిండిన రాజమహేంద్రి
- ఉభయ జిల్లాల నుంచి రాక
- కాసేపు తెలుగులో మాట్లాడిన మోదీ
- జ్ఞాపికలు అందజేసిన పవన్, లోకేశ్
- ప్రధాని మోదీ సభ విజయవంతం

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి గడ్డపై నుంచి ప్రధాని మోదీ గర్జించారు. ఎన్నికల శంఖారావం పూరించారు. రాబోయే ఎన్నికల్లో రాజమహేంద్రవరం నుంచే కొత్త చరిత్ర సృష్టిస్తామని ప్రతినబూనారు. ఆదికవి నన్నయ సరికొత్త అధ్యాయం సృష్టించినచోటే ఎన్డీయే కూడా విజయఢంకా పూరిస్తుందని ప్రకటించారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభ దద్దరిల్లింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి పోటెత్తిన జనప్రవాహంతో మార్మోగింది. అటు ప్రధాని మోదీ, ఇటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితర దిగ్గజాల హాజరుతో సభ కొత్త కళ సంతరించుకుంది. వేలాది మంది కాషాయ టోపీలు ధరించి ఉత్సాహంగా మోదీమోదీ అంటూ నినాదాలు చేయడంతో సభ హోరెత్తింది. పవన్‌కల్యాణ్ వచ్చిన వెంటనే సభలో ఉన్న వేలాది జనం కేరింతలతో గోదావరి ఉప్పెనలా హోరెత్తింది. సరిగ్గా మధ్యాహ్నం మూడున్నరకు ప్రధాని మోదీ సభా వేదికపైకి రాగానే జనం నినాదాలు చేశారు. అటు తన ప్రసంగాన్ని మోదీ తెలుగులో ఆరంభించి అందరినీ అబ్బురపరిచారు. సభకు వచ్చిన రాజమహేంద్రవరం ప్రజలకు నమస్కారాలు అంటూనే గోదావరి తల్లికి తలవంచి నమస్కరిస్తున్నా అనడంతో ప్రాంగణం ఒక్కసారిగా మార్మోగింది.

ఆదికవి నన్నయ నడయాడిన ఈ గడ్డ నుంచి ఈ ఎన్నికల్లో కొత్త అధ్యాయం సృష్టించబోతున్నామని చెప్పి గెలిచేది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, నరసాపురం లోక్‌సభ అభ్యర్థులతో పాటు అసెంబ్లీ అభ్యర్థులందరినీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే రాజమహేంద్రవరం విమానాశ్రయం, కాకినాడ పోర్టు, జాతీయ రహదారి మరింత అద్భుతంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. చెన్నై-కాకినాడ పారిశ్రామిక కారిడార్ పనులు ఊపందు కుంటాయని చెప్పి ఇక్కడ ప్రజల మనసు చూరగొన్నారు.

కూటమిలో ఫుల్ జోష్...

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, మే 6: కూటమి ఎన్నికల బహిరంగ సభకు విచ్చేసిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 3:30 గంటలకు సభావేదికపైకి మోదీ చేరుకున్నారు. సాయంత్రం 4:30 గంటలకు తన ప్రసంగాన్ని ముగించారు. తొలుత ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, రాజమహేంద్రవరం కూటమి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ శాలువాతో సత్కరించి శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, కూటమి టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అమలాపురం లోక్‌సభ కూటమి టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, కాకినాడ ఎంపీ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, నరసాపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, అనపర్తి కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం కూటమి జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నాయకులు అయ్యాజీ వేమా, కాశీవిశ్వనాథరాజు తదితరులు ప్రధాని మోదీని కలిశారు. సభా వేదికపైన కూటమి అభ్యర్థులను పలకరించారు. అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మోదీ దగ్గరకు వెళ్లి పలకరించగా ఆల్‌ద బెస్ట్ అని భుజం తట్టారు. అటు లోకేశ్ తన సరదా ప్రసంగంతో మోదీని ఆకట్టుకున్నారు. ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజా మోదీ తినాలని అనగానే నవ్వులు పూశాయి. లోకేశ్ మాట్లాడే సమయంలో ఆయన ప్రసంగానికి మోదీ చప్పట్లు కొట్టారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని లోకేశ్ మోదీకి అందించారు. మంగళగిరి నుంచి తెచ్చిన చేనేత కండువాను మోదీకి అందించారు. సభా వేదికపైకి మోదీ రాగానే పవన్ మోదీకి శాలువా కప్పారు. అనంతరం కాళ్లకు నమస్కరిస్తుండగా ప్రధాని వారించి అడ్డుకున్నారు. మోదీకి వేంకటేశ్వర స్వామి జ్ఞాపిక అందించారు. ఇలా ప్రజాగళం సభ రాజమహేంద్రవరంలో కూటమి పార్టీలకు మంచి కిక్ ఇచ్చింది. స్వయంగా మోదీ వచ్చి సభలో పాల్గొనడంతో అభ్యర్థుల్లో విజయంపై మరింత ధీమా పెంచేసింది.





చిరు కానుక : మోదీకి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందిస్తున్న పవన్‌కల్యాణ్, జనసేన అభ్యర్థులు



ఇదీ మా సంప్రదాయం : ప్రధాని నరేంద్రమోదీకి జ్ఞాపిక ఇస్తున్న టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి మహిళా నేతలు



మోదీ కటౌట్‌తో అభిమాని





అంతా ఓకేనా : ప్రధాని మోదీతో మాట్లాడుతున్న లోకేశ్



కూటమి హ్యాపీగా ఉందిలా...



నమస్తే జీ : మోదీకి నమస్కరిస్తున్న ఆదిరెడ్డి భవాని



ప్రధానికి స్వాగతం పలుకుతున్న లోకేశ్, కూటమి అభ్యర్థులు

ఆ ముగ్గురి కలయిక అపూర్వం : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ మే 6: ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తి, చంద్రబాబు యుక్తి, పవన్‌కల్యాణ్ శక్తి కలయిక అపూర్వం అని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అభ్యర్థుల ఘన విజయం తథ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి రాజమండ్రి లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది తెలుగుదేశం విధానమైతే, బాధితుల పక్షాన నిలబడి అన్యాయాన్ని ప్రశ్నించే పార్టీ జనసేన అన్నారు. కూటమి కలయిక రాష్ట్రంలో సుపరిపాలనకు దోహదపడుతుందన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. గడచిన ఐదేళ్లలో మనం అన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డామని, ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా నిలబడడం తన అదృష్టమని, ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు.

కట్టుదిట్టమైన భద్రత

కూటమి ప్రజాగళం సభ విజయవంతమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులతో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. జనం తండోపతండాలుగా రావడంతో జాతీయ రహదారి నిండిపోయింది. మహిళలు సైతం అధిక సంఖ్యలో రావడం విశేషం. సభ పూర్తయ్యేంత వరకూ ఎండను సైతం లెక్కచేయకుండా ఓపికగా ఉన్నారు. మోదీ, పవన్, లోకేశ్ ప్రసంగాలకు పెద్దఎత్తున స్పందిస్తూ చప్పట్లతో, నినాదాలతో హోరెత్తించారు. ప్రజాగళం సభకు ప్రధాని మోదీ హాజరు కావడంతో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఒక అడిషనల్ డీజీ స్వీయ పర్యవేక్షణలో ఇద్దరు ఐజీలు, తూర్పుగోదావరి ఎస్పీ జగదీశ్ సహా ఆరుగురు ఎస్పీలు.. మొత్తం సుమారు మూడు వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించాయి. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన గ్యాలరీల్లోకి చేరుకోవడానికి ముందు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. 35 చెకింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ పరిశీలించి అనుమతించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతర గస్తీ కాశాయి. భద్రతా చర్యల్లో భాగంగా వాటర్ బాటిల్, పెన్, సిగరెట్, అగ్గిపెట్టె, గుట్కా, పార్టీ జెండాలను అనుమతించలేదు. మోదీ రాకకు అరగంట ముందు నుంచీ.. ఆయన వెళ్లిన తర్వాత వరకూ వేదిక నుంచి హెలిపాడ్ వరకు జాతీయ రహదారిపై ఎవరినీ అనుమతించలేదు. రత్న ఫ్యాక్టరీ నుంచి వేమగిరి కూడలి వరకు పూర్తిగా పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. మోదీ వెళ్లిన తర్వాత జనం ఒక్కసారిగా తిరుగు ప్రయాణం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. భద్రత దృష్ట్యా వాటర్ బాటిళ్లను తీసుకెళ్లనీయకపోవడంతో గ్యాలరీలు, బయట ప్రాంగణంలో లక్షల లీటర్ల మజ్జిగ అందుబాటులో ఉంచారు. తాగునీరు కూడా ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు.



జయహో మోదీ..



మోదీ సభకు



బాగున్నారా సార్.. : ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న పవన్

మా కూటమి టీమ్ : ప్రజాగళం వేదిక నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. చిత్రంలో పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, కాకినాడ, అమలాపురం ఎంపీ అభ్యర్థులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్‌మాధుర్, అనపర్తి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు

మీకోసమే సార్ : ప్రధాని మోదీకి శాలువా కప్పుతున్న లోకేశ్

విజయీభవ



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని వేమగిరిలో సోమవారం జరిగిన వికసిత ఆంధ్ర-వికసిత భారత్ బహిరంగ సభలో అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ పాల్గొన్నారు. వేదికపై వున్న ఆయన్ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీకి పరిచయం చేశారు. లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి తనయుడని చెప్పారు. వెంటనే ప్రధాని మోదీ హరీష్ భుజం తట్టి అభినందించారు. ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించి పార్లమెంటులో అడుగుపెట్టాలి... విజయీభవ అంటూ ఆశీర్వదించారు.

రెండో రోజు 71.32 శాతం

- పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న సూక్ష్మ పరిశీలకులు, ఉద్యోగులు
- అత్యధికంగా రాజోలులో 85.90 శాతం
- అత్యల్పంగా ముమ్మిడివరంలో 58.60 శాతం పోలింగ్

అమలాపురం టౌన్, మే 6: సార్వత్రిక ఎన్నికల విధుల్లో అత్యవసర సేవల పరిధిలో ఉన్న ఉద్యోగులు, సూక్ష్మ పరిశీలకులు జిల్లాలోని ఏడు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో రెండో రోజైన సోమవారం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. 14,595 మందికి 10,409 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోగా 71.32 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా రాజోలు నియోజకవర్గంలో 85.90 శాతం, అత్యల్పంగా ముమ్మిడివరం నియోజకవర్గంలో 58.60 శాతం మంది ఓటేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెండు రోజుల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం... 2,244 మందికి 1,366 (60.87 శాతం), ముమ్మిడివరం... 1,908 మందికి 1,118 మంది (58.60 శాతం), అమలాపురం... 2,398 మందికి 1,919 మంది (80.03 శాతం), రాజోలు... 2,163 మందికి 1,858 మంది (85.90 శాతం), పి.గన్నవరం... 2,043 మందికి 1,593 మంది (77.97 శాతం), కొత్తపేట 2,054 మందికి 1,398 మంది (68.06 శాతం), మండపేట... 1,785 మందికి 1,157 మంది (64.82 శాతం).



అమలాపురంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు



కొత్తపేటలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న ఉద్యోగి

జిల్లాలో 1,251 మందికి హోం ఓటింగ్


73 బృందాలతో 85 వాహనాలు ఏర్పాటు

అమలాపురం టౌన్, మే 6: జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,251 మంది హోం ఓటింగ్‌కు అర్హత సాధించారు. వారి కోసం 73 బృందాలను నియమించడంతో పాటు 85వాహనాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో 172 మంది హోం ఓటింగ్‌కు అర్హత సాధించగా 6 బృందాలను నియమించి ఆరు వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. మండపేటలో 260 మందికి 20 బృందాలు, 20 వాహనాలు, రామచంద్రపురంలో 65 మందికి ఏడు బృందాలు, ఏడు వాహనాలు. పి.గన్నవరంలో 421 మందికి 14 బృందాలు, 14 వాహనాలు. కొత్తపేటలో 63 మందికి ఆరు బృందాలు, ఆరు వాహనాలు, రాజోలులో 161 మందికి 12 బృందాలు, 24 వాహనాలు, అమలాపురంలో 109 మందికి ఎనిమిది బృందాలు, ఎనిమిది వాహనాలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ చెప్పారు.

కూటమి వికాసం



సభకు హాజరైన జనం



బుచ్చయ్యచౌదరి



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ఆదిరెడ్డి శ్రీనివాస్



ముప్పిడి వెంకటేశ్వరరావు



మూడు పార్టీల ముచ్చట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో సోమవారం జరిగిన ప్రజాగళం సభలో మూడు పార్టీల ముచ్చట్లు కనిపించాయి. ప్రధాని నరేంద్రమోదీ రాక ముందే వేదిక గోదావరి జిల్లాలో పార్లమెంట్ అభ్యర్థులు, ఎమ్మెల్యేల అభ్యర్థులు, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఆశీనులయ్యారు. పవన్‌కల్యాణ్ పక్కన బీజేపీ మాజీ అధ్యక్షుడు వీర్రాజు కూర్చున్నారు. పవన్ వేదిక మీదకురాగా అభివాదాలు చేసుకున్నారేకానీ తర్వాత వీరు మాట్లాడుకున్నట్టు లేదు. బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నారా లోకేశ్ పక్కపక్కనే కూర్చున్నారు. పురందేశ్వరి, నారా లోకేశ్ తల్లి భువనేశ్వరి సొంత అక్కాచెల్లెళ్లు అన్న సంగతి తెలిసిందే. లోకేశ్ ఆమెకు కొడుకు అవుతారు. కానీ వీరిద్దరి పార్టీలు వేరు. ఇవాళ పొత్తు వల్ల ఒకే వేదిక మీద కూర్చునే అవకాశం లభించింది. దీనితో కాసేపు ఇద్దరూ ఏవేవో మాట్లాడుకోవడాన్ని సభలోని వారూ ఆసక్తిగా గమనించారు. మరోపక్క గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కందుల దుర్గేష్, బత్తుల బలరామకృష్ణ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకున్నారు. తర్వాత గోరంట్ల, పవన్ వద్దకు కూడా వెళ్లి కొద్దిసేపు మాట్లాడారు. గోరంట్ల, కందుల నవ్వుతూ మాట్లాడుకోవడం కనిపించింది. ముందు లోకేశ్, తర్వాత పవన్ వేదిక మీదకు రాగానే అందరూ ఒకరినొకరు పలకరించుకున్నారు. మోదీ రాగా అందరూ అభివాదం చేశారు. అనపర్తి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని పురందేశ్వరి మోదీకి పరిచయం చేశారు. ఆయన భుజం తట్టి అభినందించారు. ఇంకా వేదిక మీద ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా, బీజేపీ నేత కాశీవిశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు. ఇక వేదిక మీద టీడీపీ, జనసేన, బీజేపీ కండువాలతో నాయకుల మధ్య ఐక్యత కనిపించింది. వేదిక ముందు జనం చేతుల్లో కూడా మూడు పార్టీల జెండాలు రెపరెపలాడాయి. బొమ్మూరు నుంచి వేమగిరి వరకూ హైవే నిండా టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు రెపరెపలాడాయి.



మోదీ కటౌట్‌తో మహిళా అభిమాని



మోదీ ఫొటోలతో..



టోపీలతో సభా ప్రాంగణానికి వెళ్తున్న మహిళలు



లోకేశ్‌తో మహిళా నేతల సెల్ఫీ

జగన్ పాలనలో అన్ని వర్గాలకు దగా

రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ మే 6: అన్నివర్గాల ప్రజలను జగన్ దగా చేశాడని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ప్రజల్ని నమ్మించి మోసం చేశాడని.. అరాచక, దోపిడీ పాలనతో ప్రజలు విసుగుచెంది ఉన్నారని చెప్పారు. సోమవారం రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ప్రధాని మోదీ, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొన్న బహిరంగ సభలో బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్రం బాగా వెనుకబడి ఉందని, ఇటువంటి తరుణంలో కేంద్ర సహకారం కావాలన్నారు. అందుకే కూటమిని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే కూటమి ద్వారానే సాధ్యమన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ల సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాబోతుందన్నారు. గత ఐదేళ్లుగా జగన్ పరిపాలన దోపిడీలు అక్రమాలు అరాచకాలతో సాగిందన్నారు. ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ మోదీ, పవన్‌కల్యాణ్, చంద్రబాబుల కలయిక రాష్ట్ర భవిష్యత్తుకు మంచిదన్నారు. కూటమి విజయం సాధిస్తుందని, ప్రజలు జగన్‌ను సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నా, పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా, పేదరికం నిర్మూలించాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్న సమయంలో 23వేల మంది భారత్‌కు చెందిన విద్యార్థులు చిక్కుకున్నారని వారికోసం ప్రధాని మోదీ.. ఇరు దేశాధినేతలకు ఫోన్‌చేసి ఆరు గంటలపాటు యుద్ధాన్ని ఆపించి మన విద్యార్థులను దేశానికి తరలించారని, అది మోదీ సత్తా అని గుర్తుచేశారు. అటువంటి నేత మూడోసారి ప్రధాని అయితే దేశం ఇంకా వేగంగా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వికసిత్ భారత్ ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. నరసాపురం ఎంపీ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ కేంద్రంలోను, రాష్ట్రంలోను ఎన్‌డీఏ అధికారంలోకి రాబోతుందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను జగన్ నాశనం చేశాడన్నారు. ప్రపంచలోనే 5వ ఆర్థికశక్తిగా భారత్‌ను తీర్చిదిద్దిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు.



లోకేశ్‌తో హరీశ్, ముప్పిడి, ఆదిరెడ్డి



లోకేశ్‌తో బత్తుల



ఉదయ్‌శ్రీనివాస్, హరీశ్‌మాధుర్



వేదికపై లోకేశ్, పవన్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ఉపాధ్యాయులే టార్గెట్

పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు గందరగోళం

కాజులూరు ఉపాధ్యాయులకు అమలాపురంలో

టీచర్ల ఓట్లు చెల్లాచెదురు



కాకినాడ పీఆర్ కళాశాలలో ఓట్లు పరిశీలిస్తున్న టీచర్లు

కలెక్టరేట్(కాకినాడ), మే 6: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. ఉపాధ్యాయుల ఓట్లను చెల్లాచెదురు చేసింది. కాజులూరు మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల ఓట్లు కాకినాడలో కాకుండా అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో వేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఇతర ఉద్యోగుల తరహాలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఓటు వేద్దామని వచ్చిన కాజులూరు ఉపాధ్యాయులకు సోమవారం నిరాశ ఎదురైంది. ఓటర్ల జాబితాలో ఓట్లు లేవని ఎన్నికల అధికారులు చెప్పడంతో ఖంగుతిన్నారు. కాజులూరు మండలంలో పనిచేస్తున్న తమకు రామచంద్రపురంలో గాని, నివాసం ఉంటున్న కాకినాడలో గాని ఓటు వేసే అవకాశం ఉండాలన్నారు. వింతగా అమలాపురంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలని ఆదేశించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎక్కడైతే ఉద్యోగులు ఎన్నికల విధులపై శిక్షణ తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేశారో దాన్ని అనుసరించి ఓట్లు వివిధ ప్రాంతాలలో కేంద్రాలకు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఉపాధ్యాయులపై ఉన్న కక్ష నేపథ్యంలో ప్రభుత్వం ఓట్లు చెల్లాచెదురు చేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓటుకు రూ.5వేలు

ప్రభుత్వ ఉద్యోగులకు ఓటుకు రూ.5 వేలు వైసీపీ నాయకులు పంపిణీ చేసినట్లు ముమ్మరంగా ప్రచారం జరుగుతుంది. జిల్లాల్లో అర్బన్ ప్రాంతంలో ఓటుకు రూ.5వేలు ఇతర ప్రాంతాలలో రూ.3వేలు వైసీపీ నాయకులు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సెంటిమెంట్ ఆలయం

- రాజకీయ నాయకులకు నేమాం ఆలయం అంటే ఓ నమ్మకం
- నామినేషన్ దగ్గర నుంచి ప్రచారం వరకు ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాతే ఏదైనా..
- లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగికి కూడా ఈ ఆలయం ఓ సెంటిమెంట్

సర్పవరం జంక్షన్, మే 6: కాకినాడ రూరల్ మండలం ఈశాన్యం దిక్కులో ఉన్న గ్రామం నేమాం. ఈ గ్రామం తీరప్రాంతానికి సమీపంలో ఉంటుంది. ఈ గ్రామంలో శ్రీపర్వత వర్ధినీసమేత శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా రాజకీయ నాయకులకు సెంటిమెంట్ ఆలయం ఇది. ఎన్నికలు వస్తున్నాయంటే చాలు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ముఖ్యంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తప్పనిసరిగా నేమాం వచ్చి శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శిస్తారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరమే నామినేషన్ వేసేందుకు వెళతారు. ఎన్నికల ప్రచారం కూడా ఇక్కడ నుంచే లాంఛనంగా ప్రారంభిస్తారు. శ్రీ ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని రాజకీయ నాయకుల నమ్మకం.





పూజలు నిర్వహిస్తున్న పంతం నానాజీ (ఫైల్)

బాలయోగికి ఎంతో నమ్మకం

లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి రాజకీయంలోకి ప్రవేశించే ముందు కాకినాడ రూరల్ మండలానికి ఈశాన్య దిక్కులో ఉన్న నేమాం వచ్చి శ్రీ ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి ఎన్నికలు జరిగిన ప్రతీసారి నేమాం వచ్చి బాలయోగి పూజలు చేసిన తర్వాతే నామినేషన్ దాఖలు చేయడం, ఎన్నికల ప్రచారం నిర్వహించడం అలవాటుగా మారింది. జడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికల బరిలోకి దిగిన తర్వాత ఎస్ఆర్ఎంటీ చౌదరి వెంట వచ్చి స్వామివారిని దర్శించుకున్న తర్వాతే నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించడం, జడ్పీ ఛైర్మన్‌గా రాజకీయ ప్రస్థానం కొనసాగించడం చకచకా జరిగిపోయాయి. అక్కడ నుంచి ఎమ్మెల్యే, ఎంపీగా, లోక్‌సభ స్పీకర్‌గా రాజకీయాల్లో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. అప్పటి నుంచి రాజకీయ నాయకుల దృష్టి నేమాం గ్రామంపై పడింది. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, తిరుమాని సత్యలింగనాయకర్, అనిశెట్టి బుల్లిఅబ్బాయిరెడ్డి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వరకు ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌గా పోటీ చేసే వారు సైతం ఈ ఆలయాన్ని దర్శించుకుంటారు. నామినేషన్ వేసే ముందు, నామినేషన్ వేసిన తర్వాత, ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు ఇక్కడకు వచ్చి పూజలు చేస్తారు.

ఓటేయడానికి లండన్ నుంచి..



లండన్ నుంచి వచ్చిన యువకులు

నిడదవోలు, మే 6: ఆ యువకులు ఇద్దరూ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఎక్కడున్నా సొంత గ్రామం, సొంత రాష్ట్రం అంటే విపరీతమైన అభిమానం. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు లండన్ నుంచి స్వగ్రామం నిడదవోలు మండలం శెట్టిపేట చేరుకున్నారు. ఈ ఇద్దరిలో ఒకరైన గంధం లోకేష్ మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేయగలుగుతారో వారికే ఓటు వేయాలన్నారు. నిడదవోలు అభివృద్ధికి మేము సైతం అంటూ ఓటు హక్కును వినియో గించుకునేందుకే లండన్ నుంచి వచ్చామని తెలిపారు.

అభ్యర్థుల హైటెక్ ప్రచారం



ఈ సారి ఎన్నికల ప్రచారం హైటెక్‌గా సాగుతోంది. ప్రచారాలను పార్టీలు పూర్తిగా మార్చేశాయి. కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ చంద్రబాబు హయాంలో జరిగిన ప్రగతిని వివరిస్తూ ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రచారం చేస్తున్నారు. అంతేగాక ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసుకుని మాధ్యమాల ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. వాట్సాప్ గ్రూపులు పెట్టి అభ్యర్థుల ప్రచారాలను స్మార్ట్‌ఫోన్లలో పంపిస్తున్నారు.

● ఆత్రేయపురం

ఎన్నికల బందోబస్తుకు రాజస్థాన్ బలగాలు



రాజస్థాన్ నుంచి వచ్చిన ప్రత్యేక పోలీసు బలగాలు

పిఠాపురం, మే 6: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలకు రాజస్థాన్ నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తుకు వచ్చాయి. మన రాష్ట్రంలో మే 13వ తేదీన జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు రాష్ట్రంలో ఉన్న పోలీసు బలగాలు సరిపోవు. దీంతో ఎన్నికలు పూర్తయిన రాష్ట్రాల నుంచి పోలీసు బలగాలను రప్పించి ఇక్కడ బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రాజస్థాన్‌కు చెందిన ప్రత్యేక పోలీసు బలగాలు కాకినాడ జిల్లాకు చేరుకున్నాయి. అందులో మూడు ప్లాటూన్ల రాజస్థాన్ స్పెషల్ పోలీసులను పిఠాపురం నియోజకవర్గానికి కేటాయించారు. ఈ మూడు ప్లాటూన్లలో 240 మంది సిబ్బంది ఉంటారు. వారు సోమవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కవాతు నిర్వహించి గ్రామంలో బందోబస్తు పర్యవేక్షణకు వచ్చారు.

ఆపరేషన్ ఆకర్ష్ ట్రెండ్!

- ఆ పార్టీ వాళ్లు ఈ పార్టీలోకి.. ఈ పార్టీ వాళ్లు ఆ పార్టీలోకి జంప్
- ప్రచారానికి నేతలు వచ్చే ముందు రోజు వీధుల్లో మందు పార్టీలు

ఉప్పలగుప్తం, మే 5: ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం చూస్తుంటాం. అవతలి పార్టీ వారిని తమ వైపు ఆకర్షించేందుకు ఇప్పటికే ఆకర్ష్ పథకం అమలులో ఉన్న సంగతి తెలిసిందే. కాగా 2024 ఎన్నికల్లో కొత్తగా 'ఆకర్ష్ ఆర్భాట్' పథకం పురుడుపోసుకుంది. దీని అమలుకు అన్ని రాజకీయ పార్టీలు పోటీపడుతున్నాయి. ఈ ఆకర్ష్ ఆర్భాటం ఏమిటని సందేహం వచ్చింది కదా! ఈ పథకం ఎన్నికల ప్రచార సమయంలో మాత్రమే ఆయా గ్రామాల్లో అమలులో ఉంటుంది. పోటీలో ఉన్న పార్టీల అభ్యర్థులకు ప్రచార షెడ్యూల్ ఉంటుంది. తాము ప్రచారానికి వెళ్లే గ్రామంలో రెండు రోజులు ముందుగానే సదరు పార్టీ కీలక నేతలు ఆ గ్రామంలో ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు రాత్రి సమయాల్లో మందు పార్టీలు ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా పలు ప్రలోభాల వలలు విసురుతారు. ఈ ప్రయత్నంలో కనీసం కొందరైనా ప్రభావితులవుతారు కదా! అయితే ఇక్కడ మరో సరికొత్త ఆకర్ష్‌కు తెర తీశారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన గ్రామ కమిటీ, మండల కమిటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ పదవుల్లో ఉన్న వారు లేదా మాజీలను ప్రధానంగా ఎంచుకుంటున్నారు. ప్రచారం రోజున భారీ ఆర్భాటంతో ఆకర్షితులకు తమ పార్టీ కండువాలు వేస్తారు. వారిని తీసుకుని ఆ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తారు. దీని ప్రత్యేకత ఏమిటంటే ప్రత్యర్థి పార్టీల ముఖ్యులు తమవైపు ఆకర్షితులవుతున్నారని ఓటర్లను నమ్మించడం. ప్రత్యర్థులు బలహీనపడుతున్నారన్న సంకేతాలను జనంలోకి పంపడమన్నమాట. ఈ పథకాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జోరుగా అమలు చెయ్యడం రోజూ చూస్తున్నాం కదా!!

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
మంగళవారం 7 మే 2024

కొత్తపల్లి కొబ్బరి రేటు పైపైకి



కొత్తపల్లి, మే 6: మామిడి పండ్లలో రారాజు కొత్తపల్లి కొబ్బరి. ఎంతరేటుకైనా సంవత్సరానికి ఒక్కసారైనా కొనుక్కొని తినాలనిపించే అమృతఫలం లాంటి మామిడి పండు కొబ్బరి మామిడి అని అంటుంటారు. ఈ ఏడాది కొబ్బరి మామిడి చెట్లు పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ కాయలుగా మార్పు చెందే క్రమంలో మంచు దెబ్బకు పూత పూర్తిగా మాడిపోవడంతో మామిడి కాయల కాపు తగ్గింది. దీంతో అక్కడక్కడా ఉన్న పూతలతో కాసిన కాయలను పండ్లు తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. పచ్చికొబ్బరి మామిడి కాయలతో ఈ సీజన్లో అవకాయ పెట్టి కొత్తగా పెళ్లయిన వారి అత్తారింటికి పంపడం స్టేటస్‌గా భావిస్తారు. పచ్చడికి పెట్టేందుకు 100 పచ్చికొబ్బరి మామిడి కాయలు రూ.6 నుంచి 7వేల వరకు రేటు పలుకుతోంది. అదే విధంగా కొబ్బరి మామిడి పండ్లు పరక అంటే 14 కాయలు రేటు రూ.750 వరకు ఉంటుంది. అయినప్పటికీ మార్కెట్లో ఎక్కడా కొబ్బరి మామిడిపండ్లు దొరకకపోవడంతో దొరికిన పండ్లను చెప్పిన రేటుకు ఎగరేసుకొని పోవడం గమనార్హం.

పట్టాలు తప్పిన గూడ్స్



రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. పారాదీప్ నుంచి బళ్లారి ఎరువుల లోడుతో వెళుతున్న గూడ్స్ రైలు సోమవారం ఉదయం 6.30 గంటలకు రైల్వేస్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫామ్‌కు చేరుకుంటున్న సమయంలో ఓ బోగీ రెండు చక్రాలు పట్టాలు తప్పాయి. స్టేషన్ కావడంతో రైలు నెమ్మదిగా ప్రయాణిస్తుండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టాలు తప్పిన బోగీని వేరుచేసి రైలును పంపించేశారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు తీవ్ర గాయాలు


యజ్జల పంపాదమ్మ

పిఠాపురం, మే 6: పిఠాపురంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మరణించగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. తొండంగి మండలం ఎర్రయ్యపేట పంచాయతీ వి.కొత్తకోట గ్రామానికి చెందిన యజ్జల అప్పారావు, పంపాదమ్మ (55) పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీ సమీపంలోని వైభవ్ వెంచర్స్‌లో నివాసముంటున్నారు. వారు పిఠాపురం నుంచి కోనపాపపేట వెళ్లేందుకు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. ఉప్పాడ బస్టాండ్ వద్దకు వచ్చేసరికి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో పంపాదమ్మ మరణించగా, భర్త అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమయిన లారీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తించడంతో పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ప్రమాదం విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన కుమారులు బాబ్జీ, రమణ తల్లి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా పంపాదమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ మూకల దాడి దారుణం

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


నల్లల శ్రీధర్‌ను పరామర్శిస్తున్న వేములపాటి అజయ్‌కుమార్


తాటిపర్తిలో మోహరించిన పోలీసు బలగాలు

పిఠాపురం, మే 6: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో రోడ్‌షో నిర్వహిస్తున్న మెగా హీరో సాయిధరమ్ తేజ్‌పై వైసీపీ రౌడీమూకలు దాడి చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. వైసీపీ మూకలు విసిరిన గాజు ముక్కలు తగిలి స్థానిక జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలు కావడం చాలా బాధాకరమని చెప్పారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీధర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నామని చెప్పారు. జనసేన ర్యాలీ సందర్భంగా వైసీపీ రౌడీలు ఘర్షణ వాతావరణం సృష్టించి జనసైనికులను భయాందోళనలకు గురిచేసేందుకు రాళ్లు, గాజు సీసాలు విసిరే ప్రయత్నం చేశారని చెప్పారు. వైసీపీ జెండాలు ప్రదర్శిస్తూ జనసైనికులపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నా పోలీసు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. వైసీపీ మార్కు రౌడీయిజంతో బెదిరించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు భయాందోళనలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ అధికారులు కోరుతున్నట్లు తెలిపారు. కాగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీధర్‌ను జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ పరామర్శించారు. సంఘటన గురించి తెలుసుకున్నారు.

పోలీసు బలగాల మోహరింపు

గొల్లప్రోలు రూరల్, మే 6: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పోలీసు బలగాలను మోహరించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహిస్తున్న మెగా హీరో సాయిధరమ్‌తేజపై వైసీపీ శ్రేణులు డ్రింక్‌బాటిల్ విసిరి దాడి చేసేందుకు ప్రయత్నించగా, ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. అయితే ఆ గాజు సీసా తగిలి జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో జనసేన, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో మూడు బెటాలియన్ల పోలీసు బలగాలను సోమవారం మోహరించారు. గ్రామంలో కవాతు నిర్వహించారు. ఇక్కడ ప్రత్యేకంగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పరిస్థితిని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.

ఇద్దరు వైసీపీ నేతల అరెస్టు

గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం రాత్రి డ్రింక్‌బాటిల్‌తో సాయిధరమ్‌తేజ్‌పై దాడి చేయడంతో పాటు జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయిన సంఘటనకు సంబంధించి వైసీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉంగరాల వీరబాబు, ఆ పార్టీ నాయకుడు వెంకటరమణలను గొల్లప్రోలు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి పోలీసులు ముందుగా విచారణకు పిలిచారు. వైసీపీ నేతలు ఇద్దరి గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు. అంతకు ముందు జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ సంఘటన వివరాలను అక్కడ ఉన్న వారి నుంచి సేకరించారు. కాగా డ్రింక్ బాటిల్‌తో దాడి సంఘటనలో తీవ్రంగా గాయపడిన నల్లల శ్రీధర్‌ను మెగా హీరో సాయిధరమ్‌తేజ్ చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో పరామర్శించారు.

సాయిధరమ్‌తేజ్‌పై దాడి అవాస్తవం

ఎస్‌డీపీవో హనుమంతరావు

కాకినాడ క్రైం, మే 6: సినీ నటుడు సాయిధరమ్‌తేజ్‌పై దాడి జరిగిందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అంశం అవాస్తవమని కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీవో) కె.హనుమంతరావు పేర్కొన్నారు. కాకినాడలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జనసేన పార్టీకి మద్దతుగా సాయిధరమ్‌తేజ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తిలో రోడ్‌షో జరుగుతుండగా ఎవరో ఆగంతకులు గాజు బాటిల్‌తో సాయిధరమ్‌తేజ్‌పై దాడి చేయడంతో అతనికి ప్రమాదం తప్పి పక్కనే ఉన్న నల్లల శ్రీధర్ అనే వ్యక్తికి గాయమైనట్లు సామాజిక ప్రచార మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. వెంటనే అప్రమత్తమైన జిల్లా పోలీస్ శాఖ యుద్ధప్రాతిపదికన విచారణ చేపట్టినట్లు ఎస్‌డీపీవో వెల్లడించారు. అయితే సాయిధరమ్‌తేజ్ రోడ్‌షో నుంచి వెళ్లిపోయిన పావుగంట తర్వాత ఈ సంఘటన జరిగినట్లు అక్కడ గాజు బాటిల్ ఆనవాళ్లు కూడా లేనట్లు, శ్రీధర్‌కు రాయి తగిలినట్లు విచారణలో నిర్ధారణ అయినట్లు ఎస్‌డీపీవో స్పష్టం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సత్యదేవుడి ఆలయానికి రంగులు

అన్నవరం, మే 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న స్వామివారి దివ్యకల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో రంగులు వేసే కార్యక్రమాలు ప్రారంభించారు. ఇటీవల శ్రీరామనవమి సందర్భంగా రామాలయానికి మాత్రమే రంగులు వేయగా సత్యదేవుడి బ్రహ్మోత్సవాలకు ఆలయంలో అన్ని వ్రతమండపాలు, తూర్పు,పశ్చిమ రాజగోపురంలకు రంగులు వేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈఏడాది స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు అంగరంగవైభవంగా చేపట్టేందుకు ఇప్పటికే శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించగా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సత్యదేవుడి కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 24 వరకు జరగనున్నాయి. గతేడాది తీసుకొచ్చిన సంప్రదాయాలను పక్కనబెట్టి పూర్వపు సంప్రదాయం ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. గతేడాది స్వామివారి కల్యాణ తలంబ్రాలను గోటితో ఒలిచినవి వినియోగించగా అన్నవరం ఆలయానికి అటువంటి సంప్రదాయం లేదని బియ్యపు అక్షింతలు వినియోగించనున్నారు. అదే విధంగా శ్రీపుష్పయోగం గతేడాది ఆరుబయట వార్షిక కల్యాణవేదికపై చేపట్టగా వైదిక కమిటీ సూచనతో ఈ ఏడాది పూర్వపు పద్ధతిలో అనివేటి మండపంలో చేపట్టాలని నిర్ణయించారు.

దుర్గాడలో నక్షత్ర భస్మాభిషేకం



గొల్లప్రోలు, మే 6: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో నక్షత్ర భస్మాభిషేకం నిర్వహించారు. సోమవారం మాసశివరాత్రి సందర్భంగా ఆలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాగణపతిపూజ, మహన్యాస పారాయణ, 27 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకం చేశారు. 27 కిలోల విభూది, 27 నక్షత్రాల పూర్వక భస్మాభిషేకం నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొబైల్ నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

అమలాపురం టౌన్, మే 6: పదో తరగతి, ఆపైన విద్యార్హత కలిగిన వారంతా తమ మొబైల్ నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని జిల్లా ఉపాధి అధికారిణి యు.వసంతలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జిల్లా ఉపాధి కార్యాలయానికి రాకుండానే వారి ఇల్లు, స్వస్థలాల నుంచి ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు విద్యార్హతలు నమోదు చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ రూపొందించామన్నారు. విద్యావంతులు మొబైల్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ సిస్టమ్ ద్వారా వెబ్‌పోర్టల్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న తర్వాత జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆ దరఖాస్తులను పరిశీలించి ఆమోదం తెలిపిన వెంటనే వారి మొబైల్‌కు సమాచారం అందుతుంది. సమాచారం అందిన తర్వాత దరఖాస్తుదారులు ఎంప్లాయిమెంట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నిర్వహించే జాబ్ మేళాల సమచారం తెలుస్తుంది. ఇతర వివరాల కోసం 8121838392 నెంబరును సంప్రదించాలి.

నేడు సీఎం జగన్ కోరుకొండ రాక

కోరుకొండ, మే 6: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రధానపార్టీలు బహిరంగ సభలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నాయి. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో రోడ్‌షో నిర్వహించనున్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ రోడ్డులో సీఎం జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు రోడ్‌షో నిర్వహించారు. ఇప్పుడు కూడా సరిగ్గా అదే ప్రాంతంలో రోడ్‌షో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. రాజానగరం నియోజకవర్గం నుంచి ప్రజలను సమీకరించడానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు రంగంలోకి దిగారు. గ్రామాల వారీగా జన సమీకరణ చేపట్టారు.



సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

అమలాపురం రూరల్, మే 6: మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో సోమవారం కేంద్ర బలగాలు పోలీసులతో కలిసి కవాతు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని పలుచోట్ల నిర్వహించిన సమావేశాల్లో పోలీసు అధికారులు కోరారు. సమనస, కామనగరువు, వన్నె చింతలపూడి గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి తొమ్మిది ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లు, 5.02 లీటర్ల ఐఎంఎల్, 135 డ్యూటీపెయిడ్ లిక్కర్ బాటిళ్లు 21.30 లీటర్ల ఐఎంఎల్, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు.

వైసీపీ అవినీతి కోటలను బద్దలుకొట్టి..

కూటమి ప్రభుత్వం రానుంది

అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్


ఐ.పోలవరం మండలం గోగుల్లంకలో హరీష్‌మాధుర్‌పై పూలవర్షం కురిపిస్తున్న యువత


ప్రధాని మోదీ సభలో లోకేశ్‌తో హరీష్

అమలాపురం టౌన్, మే 6: రాష్ట్రంలో వైసీపీ అవినీతి కోటలు బద్దలై త్వరలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రానుందని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. కేంద్ర పథకాలను తన సొంత పథకాలుగా జగన్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రానికి పట్టిన శని నెలలో వదిలి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లోనే రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా రాబోతున్నాయని వివరించారు. ఐ.పోలవరం మండలం గోగుల్లంకలో సోమవారం హరీష్‌మాధుర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రచారంలో పలుచోట్ల మహిళలు, యువకులు పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల రక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించానన్నారు. నదీకోత నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు తీర ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఇంటింటికీ తిరిగి తనతో పాటు ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. స్థానిక యువకులతో సమావేశం నిర్వహించారు. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా మెగా డీఎస్సీతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రచారంలో నాయకులు ఈతకోట శ్రీను, జనిపెల్ల గిరి, పెంట రవి, ముదునూరి శ్రీరామరాజు, తిరుకోటి శ్రీకాంత్, సుంకర కొండయ్య, ఆర్.కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.


గోగుల్లంకలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హరీష్‌మాధుర్

కూటమి విజయం తథ్యం

అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు


ఓడలరేవులో కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆనందరావు

అల్లవరం, మే 6: వైసీపీ పాలనతో ప్రజలకు విసుగు పుట్టింది... ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో మండలంలోని ఓడలరేవు, తుమ్మలపల్లి, తూర్పులంక, రెల్లుగడ్డ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సోమవారం విస్తృతంగా సాగింది. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగన్ పాలన చూసి ప్రజల్లో మార్పు వచ్చిందని ఆనందరావు అన్నారు. ఎస్.యానం, ఓడలరేవులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తానని, ఆగిన ఓడలరేవు జెట్టిని పూర్తి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం మన భూమిని తాకట్టుపెట్టే దుర్మార్గపు చర్యలకు ఒడిగట్టడం సిగ్గుచేటన్నారు. అమలాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే తన ధ్యేయమన్నారు.

అల్లవరం, ఓడలరేవు, తుమ్మలపల్లి గ్రామాల్లో కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యం లో పలువురు టీడీపీలో చేరారు. అల్లవరంలో మాజీ సర్పంచ్ నిచ్చెనకోళ్ల సుదర్శనరావు, ఎంపీటీసీ ఎన్.మౌనికవరలక్ష్మితో పాటు టీడీపీలో చేరిన వారికి ఆనందరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. కొమరగిరిపట్నంతో పాటు పలు గ్రామాల్లో అనేక మంది టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, నాయకులు కొల్లు విష్ణుమూర్తి, యాళ్ల కాసుబాబు, యాళ్ల ఈశ్వరరావు, వడ్డి ఎలీషారాజు, గిడుగు భాస్కరరావు, కడలి వెంకటేశ్వరరావు, కంకిపాటి వీరబాబు, గునిశెట్టి రోహిణీకుమార్, నాతి లెనిన్‌బాబు, కుంచే వినయ్, పచ్చిమాల ఏడుకొండలు, ఎన్. చంటిరాజు, పోలిశెట్టి బాబులు, చిట్నీడి శ్రీను, కంకిపాటి గోపి పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన భార్య అరుణ, కుమారుడు కరణ్ అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల్లో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, భాస్కర్ల రామకృష్ణ, నల్లా శ్రీధర్, మెట్ల సత్య, వెలిగట్ల రామలక్ష్మణరావు, అధికారి బాబ్జీ, కొప్పుల నాగమానస, బొర్రా ఈశ్వరరావు, చెరుకూరి సాయిరామ్, యేడిద శ్రీను, ఆకుల బుజ్జి, కంచిపల్లి అబ్బులు, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు. అమలాపురంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు సమక్షంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


అల్లవరంలో టీడీపీలో చేరిన సుదర్శనరావు, ఎంపీటీసీ మౌనికలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఆనందరావు


అమలాపురంలో తండ్రి ఆనందరావుకు ఓటేయాలని కోరుతున్న కుమారుడు కరణ్

సీ-విజిల్ యాప్‌లో 566 ఫిర్యాదులు పరిష్కారం

అమలాపురం టౌన్, మే 6: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో సీ-విజిల్ యాప్ ద్వారా 693 ఫిర్యాదులు అందాయని, వాటిలో 125 ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించినవి కావని ధ్రువీకరించినట్టు యాప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. 569 ఫిర్యాదుల్లో 100 నిమిషాల్లోపు 531 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మూడు ఫిర్యాదులు పెండింగులో ఉండగా మిగిలిన 38 ఫిర్యాదులను ఆ తర్వాత పరిష్కరించామన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి 44 ఫిర్యాదులు అందగా వాటిలో 37 పరిష్కరించామని, ఏడు పెండింగులో ఉన్నాయని వివరించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నూరు శాతం పూర్తయ్యేలా ప్రణాళిక

- జిల్లాలో ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగుల ఓట్లు మూడు వేలు
- వారికి అమలాపురంలో ఫెసిలిటేషన్ కేంద్రం
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

పి.గన్నవరం, మే 6: కోనసీమ జిల్లావ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నూరు శాతం పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. పి.గన్నవరం హైస్కూల్లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి వచ్చి కోనసీమలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు మూడు వేల మంది ఉన్నారన్నారు. వారిలో రాజమహేంద్రవరం, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వారే 2,400 మంది ఉన్నారని, మిగతా వారిలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారున్నారన్నారు. వారు కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కునేందుకు ప్రత్యేకంగా జిల్లా ప్రధాన కేంద్రమైన అమలాపురం జిల్లా పరిషత్ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల్లో 25 ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఎలా వినియోగించుకోవాలో ఒక ఉద్యోగికి కలెక్టర్ అవగాహన కల్పించడంతో పాటు పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లను పరిశీలించి ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు. పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి, సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్కే హుస్సేన్, డిప్యూటీ తహసీల్దారు డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


పి.గన్నవరంలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రశ్నించే హక్కును నిలుపుకోవడమే లక్ష్యం

అమలాపురంటౌన్, మే6: ప్రజలంతా ప్రశ్నించే హక్కునునిలుపుకోవడమే జనవిజ్ఞానవేదిక మేనిఫెస్టో లక్ష్యమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. జేవీవీ జిల్లా శాఖ సమావేశాన్ని అమలాపురం ఎంప్లాయిస్ హోంలో పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు దంగుడుబియ్యం శ్రీరామమూర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడేలా అభ్యర్థులకే ఓట్లువేసి మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ పేర్కొన్నారు.

- తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధులు
- 'మేము సైతం రాష్ట్రం కోసం' నినాదంతో ప్రచారం
- పిల్లల భవిష్యత్ బాగుకోసం ఆలోచించాలి

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో భూముల దోపిడీ




దివ్యాంగులతో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి బండారు, బండారు త్యానందరావును సత్కరిస్తున్న మహిళలు



రావులపాలెంలో కూటమి అభ్యర్థి బండారుకు గుమ్మడికాయలతో దిష్టితీస్తున్న మహిళలు

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు

రావులపాలెం, మే 6: జగన్ పేదల భూములను దోచుకోవడంతో పాటు తన పార్టీ నాయకులకు దోచిపెట్టేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకువచ్చారని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు ఆరోపించారు. సోమవారం రాత్రి ఆయన రావులపాలెంలో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డితో కలిసి ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చారు. గుమ్మడికాయలతో దిష్టితీశారు. ఆర్టీసీబస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ప్రకటించినందుకు బండారును మహిళలు సత్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సూపర్‌సిక్స్ పథకాలను, మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధిని వివరించారు. వైసీపీ ఈఐదేళ్లలో చేసిన అవినీతి, అరాచకాలతో విసుగు చెందిన ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే పలువురి భూములను కబ్జా చేసిన కొత్తపేట కమల హాసన్ ఈల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఉపయోగించి విలువైన భూములను కాజేయాలని కుట్ర పన్నుతున్నాడని ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కారణంగా జిరాక్సులు తప్ప ఒరిజినల్ పత్రాలు మన చేతికి రావని, ఈచట్టాన్ని అడ్డుపెట్టుకుని గొడవలుచేసి వాటిని వారిపేరు మీద రాయించుకునే ప్రమాదం ఉంద న్నారు. ఇలాంటి దుర్మార్గాలు జరగకుండా ఉండాలంటే వైసీపీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభు త్వానికి అధికారం కట్టబెడితే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ముం దుకు దూసుకుపోవడం ఖాయమన్నారు. కూటమి ప్రభు త్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

అయినవిల్లి, మే 6: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శెట్టిబలిజ సంఘీయులంతా కృషి చేయాలని రామచంద్రపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. తొత్తరమూడిలో సోమవారం శెట్టిబలిజ సంఘీయుల సమావేశం కడలి వీర వెంకటసత్యనారాయణ(పెద్ద) అధ్యక్షతన నిర్వహించారు. వైసీపీకి చెందిన పలువురు టీడీపీ, జనసేనలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎన్నికల్లో అమలాపురం ఎంపీ అభ్యర్థి హరీష్‌మాధుర్‌కు సైకిల్ గుర్తుపైనా, పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు గాజు గ్లాసు గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని సుభాష్ కోరారు. కూటమి అభ్యర్థులు సుభాష్, సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. సమావేశంలో నాయకులు గుత్తుల బాబి, కముజు రాంప్రసాద్, చిట్టూరి విజయ్, యల్లమిల్లి విజయ్, పెచ్చెట్టి విజయలక్ష్మి, వాసంశెట్టి చిన బాబు, కడలి ఈశ్వరి, మద్దాల సుబ్బారావు, నామన రాం బాబు, వారా జయసావిత్రి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని కోరుకుంటున్నారు

రాజోలు, మే 6: చంద్రబాబునా సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని హార్టికల్చర్ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు అన్నారు. ఈసందర్భంగా ఆయన స్వగృహం వద్ద సోమవారం బోనం అధ్యక్షతన ఎన్డీయే నాయకుల సమావేశం జరిగింది. ఎన్డీయే నాయకులతో ఎన్నికల నిర్వహణ గురించి పలు అంశాలపై చర్చించారు. రాజోలు నియోజకవర్గ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్, అమలాపురం పార్లమెంటు ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లను అత్యధిక మెజార్టీతో ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ కేతా శ్రీను, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీరామమూర్తి, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, ఉపసర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, కట్టా సూరిబాబు, గుండాబత్తుల తాతాజీ, కాళ్ల సాయిబాబు, అర్జున్, ఉల్లంపర్తి దర్శనం, గెడ్డం ప్రసాద్, బోనం ఫణికృష్ణ, చెల్లుబోయిన రామచంద్రరావు, సూదా మోహన్, చిట్టూరి సంతోష్ పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి బుచ్చిబాబుపై విమర్శలు తగదు

ముమ్మిడివరం, మే 6: ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబుపై ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పొన్నాడ సతీష్‌కుమార్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ సమావేశం తీవ్రంగాఖండించింది. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు మాట్లాడుతూ మత్స్యకార సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న బుచ్చిబాబు 2014 నుంచి 2019 వరకు మత్స్యకార గ్రామాల్లో 13 తుఫాను షెల్టర్లు నిర్మించి ప్రతీ గ్రామానికి తాగునీరు, సీసీ రోడ్లు వేయించారని, వేట నిషేధం సొమ్ములు కూడా పెంచడం జరిగిందన్నారు. పొద్దోకు నారాయణరావు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, పొత్తూరి విజయబాస్కవర్మ, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజిబాబు, నడింపల్లి శ్రీనివాసరాజు, రెడ్డి సుబ్బారావు, పితాని రామకృష్ణ, ముమ్మిడివరపు వరలక్ష్మి, సైదుం అప్పారావు, గెడ్డం శ్రీనివాసరావు, దొంగ గంగాధర్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ఆలమూరు, మే 6: ఆలమూరు మండల ప్రజా పరిషత్ సమావేశం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం సాదాసీదాగా జరిగింది. ఎన్నికల సమయం కావడంతో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ముగించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా మండల నిధులతో చేతిపంపులు వేసినట్టు ఎంపీపీ తెలిపారు. దాళ్వా వరి కోతలు దాదాపు పూర్తయ్యాయని, 80శాతం ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు చెల్లింపులు కూడా త్వరితగతిన జరుగుతున్నాయని మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీలావణ్య తెలిపారు. వేసవిలో ప్రజలకు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి భవానీశంకర్ సూచించారు. ఇరిగేషన్ గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఆ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మూలస్థానం సర్పంచ్ వరప్రసాద్ కోరారు. జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీడీవో మేరీరోజ్, ఈవోపీఆర్డీ రాజ్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి రామస్వరూప్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు బ్రహ్మాజీ మృతి

ఉప్పలగుప్తం, మే 6: చల్లపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, నీటి సంఘం మాజీ చైర్మన్ భోగిశెట్టి బ్రహ్మాజీ (75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహంపై టీడీపీ పతాకాన్ని కప్పి పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. బ్రహ్మాజీకి అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, పోలిశెట్టి శివాజీ, గొలకోటి చిన్నా, దంగేటి రవీంద్రనాథ్, యరగర్ల వెంకటేశ్వరరావు, కుంపట్ల నరసింహారావు, నిమ్మకాయల పేరయ్యనాయుడు నివాళులర్పించారు.

కొట్లాట కేసులో ఏడాది జైలు

ముమ్మిడివరం, మే 6: కొట్లాట కేసులో ఏడుగురు నిందితులకు ఒక్కొక్కరికీ ఏడాది జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ మహ్మద్ రహ్మతుల్లా సోమవారం తీర్పు చెప్పారు. ఆస్తి తగాదాకు సంబంధించి ముమ్మిడివరం నగర పంచాయతీ నక్కావారిపేటకు చెందిన నక్కా శాంతి, నక్కా బాలమురళీకృష్ణలపై అదే గ్రామానికి చెందిన నక్కా చిట్టిబాబు, నక్కా శ్రీనివాసరావు, నక్కా రాజశేఖర్, వరసాల బాల, జిత్తుక సూరమ్మ, నక్కా లావణ్య, నక్కా లక్ష్మీలు దాడిచేసి గాయపరిచారు. 2018లో అప్పటి ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదుచేశారు. ఈకేసులో వాదోపవాదాలు అనంతరం నేరారోపణ రుజువుకావడంతో మేజిస్ట్రేట్ తీర్పుచెప్పారు. ఏపీపీ రాధిక కేసు వాదించారు.

బ్యాంకు ఖాతాలో నగదు మాయంపై ఫిర్యాదు

రావులపాలెం, మే 6: తన ప్రమేయం లేకుండా తన బ్యాంకు ఖాతా నుంచి రూ.50వేలు మాయమైందని రావులపాలేనికి చెందిన కొవ్వూరి సతీష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సతీష్‌రెడ్డికి రావులపాలెం ఎస్‌బీఐలో 2013 నుంచి ఖాతా ఉంది. సోమవారం అతని ఖాతా నుంచి నెఫ్ట్ ద్వారా రూ.50వేలు బదిలీ అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ ఆంజనేయులు బ్యాంకు అధికారుల వివరణ తీసుకున్నారు. సైబర్ క్రైమ్‌గా కేసు నమోదు చేశారు.

కూటమిదే విజయం



అంతర్వేది, మే 6: ఎన్నికల్లో కూటమిదే విజయమని మెగా సుప్రీమ్ హీరో సాయిధరమ్‌తేజ్ అన్నారు. సోమవారం సాయంత్రం అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. తొలుత అభిమానులు, ప్రజలు, కూటమి శ్రేణులు స్వాగతం పలికారు. అంతర్వేది నుంచి కరవాక వరకు జరిగిన ప్రచార రథంపై నుంచి సాయిధరమ్‌తేజ్ మాట్లాడారు. సామాన్యులకు ప్రతీ సంక్షేమం అందాలంటే కూటమి ప్రభుత్వమే రావాలన్నారు. కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం అంతర్వేది నుంచి ప్రారంభమై చింతలమోరి, కేశవదాసుపాలెం, శంకరగుప్తం, కేశనపల్లి మీదుగా కరవాకకు చేరుకుంది.

యువత ఉజ్వల భవిష్యత్‌కు చంద్రబాబును గెలిపించండి

ఉప్పలగుప్తం, మే 6: రాష్ట్రంలో యువత భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చెయ్యాలని తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. 'మేము సైతం రాష్ట్రం కోసం' నినాదంతో సోమవారం వారు గొల్లవిల్లిలో అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లకు మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిఅవకాశాలు లేకఇతర రాష్ట్రాల్లో పొట్టపోసుకుంటున్న పిల్లల భవిష్యత్ బాగుకోసం తల్లిదండ్రులు ఆలోచించి కూటమికి ఓటెయ్యాలని కోరారు. కూటమి మేనిఫెస్టోను మహిళలకు వివరించారు. వింగ్ అధ్యక్షుడు కడలి దేవీప్రసాద్, కార్యదర్శి గిడుగు నాని, మండల శాఖ అధ్యక్షుడు భాస్కర్ల రవితేజ, అరిగెల నరేష్, టీడీపీ, జనసేన నాయకులు చీకట్ల ఏసు, కడలి శ్రీనివాసరావు, అడబాల సత్యనారాయణ, అరిగెల సాత్విక్, మద్దింశెట్టి సీతారామస్వామి, నాగిరెడ్డి మణికంఠ, పైబోడి వీరేంద్ర, వేలా రాజాపాల్గొన్నారు.

వైసీపీ పాలనలోనే అన్ని నియోజకవర్గాల్లో అవినీతి





కాట్రేనికోన మండలం బలుసుతిప్ప, మొల్లేటిమొగ, కొత్తపాలెం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఎన్నికల ప్రచారం

కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు

కాట్రేనికోన, మే 6: వైసీపీ పాలకుల ఏలుబడిలో అన్ని నియోజకవర్గాల్లో అవినీతి రాజ్యమేలిందని ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఆరోపించారు. గత అయిదేళ్ళలో ముమ్మిడివరం నియోజకవర్గం అధోగతి పాలయ్యిందన్నారు. సోమవారం బలుసుతిప్ప, మొల్లేటిమొగ, కొత్తపాలెం, పోర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అరాచక పాలన అంతమొందించేందుకు ఈనెల13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. తీరప్రాంత గ్రామాల్లో ఎన్నో సమస్యలున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పిలిస్తే పలికే నాయకత్వాన్ని కోరుకోవాలని, ఎవరు ఆపదలో ఉన్నా తాను ముందుకు వచ్చానని గుర్తుచేశారు. తీర గ్రామాల్లో ప్రజలు సుబ్బరాజుకు హారతులిచ్చి ఆదరించారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ప్రభుత్వాన్ని చెత్త బుట్టలో పడేయడం ఖాయమని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలోను లేని ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రాష్ట్రంలో అమలుచేసి ప్రజల భూములకు రక్షణ లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజల భూములకు, ఆస్తులకు రక్షణతో పాటు రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ అరాచక పాలనకు మరో పది రోజుల్లో ముగింపు పలికేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ప్రభుత్వాన్ని చెత్త బుట్టలో పడేయడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, ఆకాశం శ్రీను, పొద్దోకు బాలు, బోనం కృష్ణ, మోకా బాలప్రసాద్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సత్తాల ప్రసాద్, వెంట్రు సుధీర్, విత్తనాల బుజ్జి, విత్తనాల వెంకటరమణ, సంగాని వెంకటేశ్వరరావు, దండుప్రోలు సత్యం, తిరుమాని వీరబాబు, మల్లాడి అన్నవరం, ఓలేటి మార్రాజు, సంగాని సూర్యనారాయణ, మోకా అప్పాజీ, సూదా బాబూరావు,నంద్యాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





జగన్ విధ్వంసకర పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలి





మండపేట పట్టణంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ఎన్నికల ప్రచారం దృశ్యాలు

మండపేట అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వ రరావు




ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం చేస్తున్న వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేటలో వేగుళ్ల కుమార్తెలు, కుటుంబ సభ్యుల ప్రచారం

మండపేట, మే 6: రాష్ట్రంలో ఐదేళ్ల సీఎం జగన్ విధ్వం సకర పాలనకు ఓటుతో బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైం దని మండపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వ రరావు అన్నారు. వైసీపీ పాలనలో నవరత్నాలు కంటే నవమో సాలే ఎక్కువ జరిగాయని, రాష్ట్రంలో జగన్ కుటుంబం, ఆయన అనుచరగణం తప్ప రాష్ట్రంలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రకృతిలో లభించే ఇసుక, మట్టి, గ్రావెల్ దోచుకోవడం తప్ప అభివృద్ధి ఏమిలేదన్నారు. మద్య నిషేధం తర్వాత ఓటు కోసం వస్తానన్న జగన్ తన అనుచరుల డిస్టిరీల ద్వారా తయారుచేసిన నాసిరకం మద్యం ద్వారా రూ.వందల కోట్లు దోచుకుని ప్రజారోగ్యంతో ఆటలు ఆడుకున్నాడన్నారు. మండపేటలో సోమవారం వేగుళ్ల జోగే శ్వరరావు విజయం కోరుతూ కూటమి కార్యకర్తలు, నాయకులు బారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా టీడీపీ పట్టణ కార్యాలయం నుంచి బయలుదేరిన ర్యాలీ రథం గుడి సెంటరు నుంచి కేపీ రోడ్డు మీదుగా మారేడుబాక వంతెన న్యూకాలనీ, ఎస్సీ కాలనీ, రజకకాలనీ, అంబే డ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కూటమికి ఓట్లు వేసి తనను, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌లను గెలిపించాలని వేగుళ్ల కోరారు. వైసీపీ అభ్యర్థి తోటపై జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాలనలో మండపేట నియోజకవర్గంలో వైసీపీ ప్రభు త్వం చేసిందేమిలేదన్నారు. కూటమి మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలు గురించి నేతలు వివరించారు. బైక్ ర్యాలీలో పలు చోట్ల పట్టణంలో ఉన్న దేవాలయాలను వేగుళ్ల సందర్శించి స్వామివార్లకు పూజలు చేశారు. కాలనీలో ఉన్న దేశ నేతలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. మూడుసార్లు తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ప్రజలు నాల్గవ సారి కూటమి తరపున గెలిపించి అసెంబ్లీకి పంపించాలని వేగుళ్ల ప్రజలను కోరారు. వార్డుల్లో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. దారిపొడవునా ఆయనకు అభిమానులు పూలతో స్వాగతం పలికారు. ప్రచారంలో మండపేట మున్సి పల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, చుండ్రు సోమ రాజు, కాళ్లకూరి శ్రీనివాస్, పాలచర్ల శిరీషా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మల్లిపూడి గణేష్, కొవ్వాడ అప్పన్నబాబు, ముమ్మిడివరపు ఆదినారాయ ణ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కూమార్తెలు కుటుంబ సభ్యుల ప్రచారం

కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోరుతూ సోమవారం పాలతోడు, ఇప్పనపాడు ఆయన కుమార్తె వి.మణిమంజరి, సోదరుడు కుమార్తె ముత్యాల మణిమంజరి ఎన్నికల ప్రచారం చేశారు. ఏడాదికి మూడు సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగభృతి, యువతికి ఉపాధి అవకాశాలు వంటివి కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమన్నారు. ప్రజల కోసం పనిచేసే చంద్రబాబునాయుడును గెలిపించాలని వారు కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే యువతకు ఉద్యోగాలు, ఉపాధి





వెల్లసావరంలో గీతకార్మికుడిని ఓటు అభ్యర్థిస్తున్న సుభాష్, వెల్లసావరంలో సుభాష్‌కు గుమ్మడికాయ దిష్టి తీస్తున్న దంపతులు, బొందెలగూడెంలో సుభాష్ ఎన్నికల ప్రచారం

ద్రాక్షారామ, మే 6: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధ్యమని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం మండలం వెల్ల శివారు వెల్లసావరం, ద్రాక్షారామ శివారు బొందెల గూడెం, తోటపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సుభాష్ మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలనా అనుభవంతో రాష్ట్రంలో పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చి మేనిఫెస్టోలో పేర్కొన్నవిధంగా యువతకు అయిదేళ్లలో లక్షలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కుల రిష్వంత్‌రాయ్, పీఏసీసీఎస్ మాజీ అధ్యక్షుడు పాముల వీరభద్రరావు, జనసేన నాయకులు దూడల నాగభూషణం పాల్గొన్నారు. తోటపేట ఎన్నికల ప్రచారంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం పాల్గొన్నారు. రామచంద్రపురంలో 28వవార్డులో కూటమి అభ్యర్థి సతీమణి వాసంశెట్టి లక్ష్మీసునీత సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి మేనిఫెస్టో పత్రాలు పంపిణీ చేశారు. 13న జరిగే ఎన్నికల్లో టీడీపీకి సైకిల్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



తోటపేటలో సుభాష్, చంద్రశేఖర్‌లకు ఘనస్వాగతం



పామర్రులో ప్రచారం చేస్తున్న సుభాష్ సతీమణి, హరీష్ సోదరీమణులు

తెలుగుదేశంతోనే మహిళా సాధికారిత

కె.గంగవరం, మే 6: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మహిళా సాధికారిత జరుగుతుందని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సతీమణి సునీత, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ సోదరీమణులు గంటి దీప్తి, గంటి రమ్య అన్నారు. సోమవారం వారు పామర్రులో ఇంటింట ప్రచారం చేశారు. రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, మరివాడ సూరిబాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం




శానపల్లిలంకలో గిడ్డి సత్యనారాయణకు హారతి ఇస్తున్న మహిళ, శానపల్లిలంకలో ఓట్లు అభ్యర్థిస్తున్న గిడ్డి



తొత్తరమూడిలో శెట్టిబలిజ సంఘీయుల సమావేశంలో సన్మానం

పి.గన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, మే 6: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధితో పాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం అందుతుందని పి.గన్నవరం కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. సోమవారం శానపల్లిలంక, కె.జగన్నాథపురం గ్రామాల్లో ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పి.గన్నవరం అసెంబ్లీకి గాజు గ్లాసు గుర్తుపైనా, అమలాపురం పార్లమెంటుకు సైకిల్ గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలతో పాటు కూటమి అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల ఆయనకు మహిళలు హారతులిచ్చిస్వాగతం పలికారు. ప్రచారంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, నాయకులు కొరిపల్లి శ్రీనివాస్, బొబ్బా ప్రభాత్‌కుమార్, సలాది పుల్లయ్యనాయుడు, మద్దాల సుబ్బారావు, సలాది బుచ్చిరాజు, సయ్యపరాజు సత్యనారాయణరాజు, కళ్లేపల్లి సుబ్బరాజు, వేటుకూరి రమేష్‌రాజు, తొత్తరమూడి ప్రభాకరరావు, నేదునూరి వీర్రాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, కడలి శంకరం, సలాది బుచ్చిరాజు, మట్టపర్తి రాజేశ్వరరావు, బొబ్బిలి అయ్యప్ప, మోత వెంకటేశ్వరరావు, కడలి ఈశ్వరి, బిక్కిన బాబి పాల్గొన్నారు.